# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

| బుధవారం | 07 జనవరి, 2026 | పేజీలు :08 |
|---|---|---|


## చలి తీవ్రతతో వరి నారు విలవిల..




2



## పత్తి రైతు చిత్తు.. పెట్టుబడి రాక కుదేలు

ప్రజాపక్షం/రెబ్బెన : ఈసారి కురిసిన అధిక వర్షాల కారణంగా పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెబ్బెన మండలంలోని కొమురవెల్లి గ్రామంలో రైతులు అత్యధికంగా పత్తి సాగు చేయగా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతన్నలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి కేవలం 5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే రావడంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

### అడుగడుగునా అడ్డంకులే

పంట సాగు ఆరంభంలో పత్తి విత్తనాలు నాటే సమయంలో సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు మళ్లీ మళ్లీ విత్తనాలు నాటాల్సి వచ్చింది. దీంతో సాధారణం కంటే ఈసారి పెట్టుబడి అధికమైంది. తీరా పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాలు కురవడంతో పత్తి కాయలు మొత్తం కుళ్ళిపోయాయి. దీనికి తోడు సమయానికి యూరియా దొరక్క, ఫెర్టిలైజర్ షాపుల్లో ప్రత్యామ్నాయ ఎరువులు వాడాల్సి రావడంతో రైతులకు సాగు ఖర్చు మరింత భారంగా మారింది. రైతు రాజు అనేది కేవలం మాటలకే పరిమితమని, నిజ జీవితంలో అది ఎప్పుడూ జరగదని రైతులు వాపోతున్నారు.

### కౌలు రైతులకు శాపంగా కిసాన్ కపాస్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తరువాయి 2లో..



## జిల్లా సంక్షేమ అభివృద్ధిలో కలిసి పనిచేద్దాం

### కలెక్టర్ చేతుల మీదుగా టిఎన్జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లా సంక్షేమ అభివృద్ధిలో కలిసి పని చేద్దామని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష అన్నారు. మంగళ వారం రోజున టీఎన్జీఓ సంఘం, పెద్దపల్లి జిల్లా వాల్ క్యాలెండర్ 2026, క్యాలెండర్ 2026 ఆవిష్కరణ ఐడిఓసి, పెద్దపల్లి ప్రాంగణంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష చేతుల మీదుగా వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సంక్షేమం అహర్నిశలు గురించి కృషి చేస్తున్నారని, ప్రభుత్వపథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలని, విద్యా మరియు వైద్య రంగాలలో జిల్లాను అగ్రగామిగా నిలపాలని , ఉద్యోగుల పనితీరు తనకు సంతృప్తికరంగా ఉందని అన్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లా టీఎన్జీఓ అధ్యక్షులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జే ఏ సీ చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని సమస్త ఉద్యోగస్తుల ఐక్యతకు ఈ టిఎన్జీఓ క్యాలెండర్ ప్రతీకగా నిలుస్తుందని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు టీఎన్జీఓ సంఘం అనునిత్యం ముందుంటుందని, ఉద్యోగులు సంఘాలకు బాసటగా నిలిచినప్పుడే మన ఉద్యోగులకు రావాల్సినవన్నీ సాధించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహా అధ్యక్షులు అనిత, కోశాధికారి ఆడెపు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కొమురయ్య, పబ్లిసిటీ సెక్రటరీ మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు శ్రీ అయిరెడ్డి సందీప్ రెడ్డి, కార్యదర్శి శ్రీ ప్రవీణ్ , స్వప్న, శ్రీధర్, విష్ణు, రవి, శ్రీనివాస్, శిల్ప, సౌమ్య, అన్విత, ఉమ, శ్రీనివాస్, రాజేష్, రజీ, ప్రమోద్, రాజన్న, తిరుపతి, సాధిక్, అఖిల్, నిఖిల్ మరియు టీఎన్జీఓ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నిర్ణీత కాల వ్యవధిలో లక్ష్యాలు పూర్తి చేయాలి

బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం

7

## వార్డుల ఓటరు జాబితాపై అభ్యంతరాలు అందించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



4

## నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు

నిధులు మంజూరు కాకపోవడంతో రోడ్డు పనులు మధ్యలోనే...



2

## నవ భారతాన్ని నిర్మించే శిల్పులు శిశుమందిర్ గురువులు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



2



## పిఆర్‌టియు టిజి క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** పిఆర్‌టియు తెలంగాణ కరీంనగర్ జిల్లాశాఖ రూపొందించిన క్యాలెండర్‌ను కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ తన కార్యాలయం ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విధ్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని, పదో తరగతి పరీక్షల ఫలితాలలో కరీంనగర్ జిల్లా అగ్రస్థానం సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. పిఆర్‌టియు తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాఆస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డి, నాయకులు చొల్లేటి శ్రీనివాస్, పులిపాక కిషన్, చిందం రమేష్, తునికి భూపతి, మొగిలి శ్రీనివాస్, భూక్యా ఉమాపతి, రాచమల్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

## అన్నమయ్య వారసులకు పాదపూజ

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ డివిజన్‌లోగల శ్రీ శివకేశవ క్షేత్రంలో శ్రీతిరుమల శ్రీవారి సంకీర్తన కైంకర్యులు అన్నమయ్య వారసులు శ్రీమాన్ శ్రీశ్రీశ్రీ తాళ్లపాక మహారాజ్ స్వామి (12వ తరం) వారికి గురుపాద పూజ జరిపారు. అన్నమయ్య కీర్తనలు పాడుతూ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరాజు ప్రశాంత్ శర్మ, ఐనవోలు రాధాకృష్ణ శర్మ, కరణం హరిప్రసాద్ శర్మ, కిరణ్ శర్మ, విశాల్ శర్మ, సుంకిశాల సంపత్ రావు, నందాల తిరుపతి, గౌడ అరవింద్‌కుమార్, పవన్ కుమార్, వేముల రామచంద్రం, డివిజన్లోని భక్తులు పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు.

## పచ్చదనంతోనే గ్రామాభివృద్ధి



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** గ్రామాభివృద్ధిలో పచ్చదనం కీలక పాత్ర పోషిస్తుందని ఎల్కపల్లి గ్రామ సర్పంచ్ భక్తు రాంచందర్ అన్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. నర్సరీ ద్వారా గ్రామంలో అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ టాకిరా అనిల్, వార్డు సభ్యులు, ఏపివో సతీష్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మేటి మహంకాళి శ్రీశైలం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం తెర్లుమాద్ది గ్రామ సబ్ స్టేషన్ నుండి సేవాలాల్ తండా గ్రామానికి ప్రభుత్వం కిలోమీటర్ బీట్ రోడ్డును కోటి రూపాయలతో నిర్మించడానికి ప్రతిపాదనలు ఇచ్చింది. తండా గ్రామం కావడంతో గిరిజన సంక్షేమ శాఖకు రోడ్డు నిర్మాణ పనులు అప్పగించింది. కాంట్రాక్టర్ ద్వారా కంకరతో రోడ్ మరమ్మతులు చేపట్టగా నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో రోడ్డు పనులు మధ్యలోనే రెండు సంవత్సరాల క్రితం నిలిచిపోయాయి. సేవాలాల్ తండా గ్రామానికి వెళ్లే ప్రజలు ప్రయాణికులు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణ పనుల త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మట్టితో వేసిన రోడ్డుపై వాహనాలు వెళుతుంటే దుమ్ముతో ఇబ్బందిగా ఉంది ప్రభుత్వం వెంటనే నిర్మాణ పనుల త్వరగా చేపట్టాలి.

– జెల్ల నాగరాజు (గ్రామస్తుడు)

గిరిజన శాఖ అధికారిని ఈఈ మాధురితో రోడ్డు నిర్మాణం గురించి మాట్లాడాం. సేవాలాల్ తండా గ్రామానికి త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

– కట్ల వేణు (ఉప సర్పంచ్ సేవాలాల్ తండా)

రోడ్డు నిర్మాణ పనులు పది రోజులలో ప్రారంభించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– రాంచంద్రం (కాంట్రాక్టర్)

## నవ భారతాన్ని నిర్మించే శిల్పులు శిశుమందిర్ గురువులు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** దేశ భవిష్యత్తును నిర్మించే మౌన కర్మాగారం సరస్వతి శిశు మందిర్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నవ భారతాన్ని నిర్మాణానికి కృషి చేసే శిల్పులు శిశుమందిర్ గురువులని కొనియాడారు. ఇంత గొప్ప స్కూల్ లో చదువుకోవడం గర్వంగా ఉందన్నారు. సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, ధర్మం వంటి అంశాలు శిశు మందిర్‌లోనే నేర్చుకున్నానని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలన్నింటికీ పక్కా భవనాలు నిర్మించడంతోపాటు ల్యాప్‌టాప్ సహా ఇతర సౌకర్యాలన్నీ కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్‌లోని హౌజింగ్ బోర్డు కాలనీలోని సరస్వతి శిశు మందిర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే ఆటల పోటీల (ఖేల్ ఖుద్) ప్రారంభ కార్యక్రమానికి బండి సంజయ్ విచ్చేశారు. పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడారు. టీచర్లతో కలిసి ఫోటోలు దిగారు. అంతకుముందు పిల్లలను ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడారు. దేశ భవిష్యత్తును మౌనంగా నిర్మిస్తున్న కర్మాగారం. మానవీయ విలువలను పెంపొదిస్తూ దేశ భవిష్యత్ కోసం నవ తరాన్ని తయారు చేయడంలో సరస్వతి శిశు మందిర్ విద్యాలయాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఇందులో చదువుకోవడం మన అదృష్టమన్నారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పార్టీ జిల్లా మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రోజున సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కార్ఖానా గడ్డలోని ప్రభుత్వ షెడ్యూల్ కులముల బాలుర కళాశాల హాస్టల్ను సందర్శించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. నూతన హాస్టల్ నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి నిధులు వెంటనే విడుదల చేసి త్వరితగతిన హాస్టల్ నిర్మించాలన్నారు.పాత హాస్టల్ శిథిలావస్థలో ఉండడం మూలంగా వర్షాకాలం, గదుల్లోకి నీళ్లు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడి కందుల సత్యం, తిప్పారపు సురేష్, శ్రీకాంత్, కనకరాజు, అరవింద్, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** నగరంలోని టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆద్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా నిర్వాహకులు ముగ్గుల పోటీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ కార్పోరేటర్ చొప్పరి జయశ్రీ హాజరై విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. సంక్రాంతి పండుగ సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలను ప్రోత్సహించే విధంగా నిర్వహించిన ఈ ముగ్గుల పోటీ కార్యక్రమం ద్వారా సంస్థలో ఐక్యత, టీం స్పిరిట్ నెలకొంటాయని, వినియోగదారులకు బీమాను అందజేయడమే కాకుండా సంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాలకు తీసుకెళ్తున్న సంస్థకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు కె.వీరస్వామి, కె.ఆదర్శ్, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీకాంత్, నవీన్, చంద్రశేఖర్, ట్రైనర్ వెంకటేష్ వర్మ, మేనేజింగ్ పార్ట్నర్ కెజి నరేందర్‌రావు, మహేందర్, లీడర్లు, అడ్వైజర్లు పాల్గొన్నారు.

## రహదారి భద్రత కార్యాచరణ కరపత్రాల విడుదల



**ప్రజాపక్షం/బోథ్ :** తెలంగాణా రాష్ట్ర లీగల్ సర్వీసెస్ ఆథారిటి హైకోర్టు హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా,మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రహదారి భద్రత కార్యాచరణ కరపత్రలను మంగళవారం బోథ్ మండలం పట్నాపూర్ గ్రామపంచాయతి లోని ఇంకర్‌పల్లి గ్రామంలో బోథ్ బార్ అసోసియేషన్ సెక్రటరీ న్యాయవాది పంద్రం శంకర్ విడుదలచేశారు.ఈ సందర్భంగా న్యాయవాది పంద్రం శంకర్ మాట్లాడుతూ జనవరి 5 నుంచి జనవరి 9 వరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.వాహనాలు నడిపే వారు కచ్చితంగా లైసెన్స్ హెల్మెట్ వాహన బీమా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సిద్దం రాంపలుకు, ఆడేం శంబు, తోడషం భీంరావ్, రాంకిషన్ రాజశేఖర్, మహేష్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

## చలి తీవ్రతతో వరి నారు విలవిల

**ప్రజాపక్షం/రెబ్బెన :** మండలంలో పెరిగిన చలి తీవ్రత కారణంగా వరి నారు ఎదుగుదల లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా వరి నారు పోసిన 20 నుంచి 25 రోజుల్లో నాట్లు వేసేందుకు సిద్ధమవుతుంది. కానీ రెబ్బెన మండలంలో నారు పోసి 20 రోజులు గడుస్తున్నా రెండు మూడు అంగుళాలకు మించి పెరగలేదని రైతులు వాపోతున్నారు. గత కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడం, సూర్యరశ్మి తగినంతగా లేకపోవడంతో నారు ఎదుగుదల కుంటుపడిందని తెలిపారు. ఏటా జనవరి 10 నుంచి 20 లోపు నాట్లు వేసేవారమని, ప్రస్తుత పరిస్థితుల్లో ఫిబ్రవరి వరకు ఆలస్యం అయ్యేలా ఉందని పేర్కొన్నారు. నాట్లు ఆలస్యమైతే చీడపీడల బెడద పెరిగి దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, పెట్టుబడి భారం తడిసి మోపెడవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్లో యూరియా కొరత, అధిక వర్షాలు, కూలీల రేట్లు పెరగడంతో తీవ్రంగా నష్టపోయామని, ఇప్పుడు రబీలో సాదు సమస్యతో పాటు చలి ప్రభావం చూపడం తమను కోలుకోలేకుండా చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## పత్తి రైతు చిత్తు.. పెట్టుబడి రాక కుదేలు

(మొదటి పేజీ తరువాయి)

కిసాన్ కపాస్ యాప్ విధానం వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట అమ్ముకునే సమయంలో భూ యజమానుల పేర్లే వస్తుండడంతో, వారి అనుమతి కోసం పత్తి విక్రయించేటప్పుడు ఒక్కో క్వింటాల్ కు వంద నుంచి 200 రూపాయల వరకు యజమానులకు ముట్టజెప్పుకోవాల్సి వస్తోంది. ఇది కౌలు రైతుల పాలిట శాపంగా మారింది.

### గిట్టుబాటు ధరే నిజమైన భరోసా

రైతు బాగుపడాలంటే రైతుబంధు పథకం ఒక్కటే పరిష్కారం కాదని, పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర ఉండాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న రైతుబంధు విధానం వల్ల కష్టపడి సాగు చేసే వారికి కాకుండా, కేవలం భూమి ఉన్న వారికే లబ్ధి చేకూరుతోంది. నిజమైన రైతు అంటే భూమి ఉన్నవారు కాదని, పంట పండించేవారని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఎరువుల ధరలు తగ్గించి, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తేనే అది కష్టపడి పనిచేసే రైతుకు దక్కుతుందని అభిప్రాయపడ్డారు.

## క్రీడా పరికరాలు అందజేత

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ సాయి సోమవారం తన సిబ్బందితో కలిసి మండంలంలోని సొంగ్వి పల్లె గ్రామానికి చెందిన పలువురు యువకులకు క్రీడా పరికరాలను అందజేసినట్లుగా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడల పట్ల ఒక్క యువకుడు ఆసక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండడమే కాకుండా అనవసర విషయాల జోలికి పోకుండా, మంచి విషయాలను పెంపొందించుకోవాలని చెప్పారు. అలాగే క్రీడలలో నైపుణ్యం పెంచుకోవడం మూలంగా ఉత్తమ క్రీడాకారులుగా మారడమే కాకుండా, సమాజంలో మించి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ రైటర్, మోహన్ రాథోడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖాన పరిశీలన

**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ పట్టణంలోని 32వ వార్డు చావడి వద్ద గల బస్తీ దవాఖాన పనులను మంగళవారం జిల్లా వైద్యాదికారి డాక్టర్ రాజశ్రీ పరిశీలించారు. పట్టణంలోని వార్డు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానను ఏర్పాటు చేయడం జరుగుతుందని అతి త్వరలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని డాక్టర్ రాజశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ సమత, మున్సిపల్ అధికారులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ పట్టణంలోని బైపాస్‌లో గల బోర్రా గణపతి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అంగారక సంకట చతుర్థి సందర్భంగా భక్తులు ఆలయానికి విచ్చేసి గణనాథునికి ప్రత్యేక పూజ, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మధుసూధన్ మహారాజ్ భక్తులకు అర్చనలు హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు రాజేశ్వర్ రావు మాట్లాడుతూ.. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంలా బొర్రా గణపతి ఆలయం పేరుగాంచిందన్నారు. ప్రతి మంగళవారం భక్తులు ఆలయానికి విచ్చేసి వారి కోరికలను కోరుకొని మొక్కులను చెల్లించుకుంటారని అన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

# ఓటర్ జాబితాలో అభ్యంతరాలపై తెలియజేయాలి

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో విడుదల చేసిన ఓటర్ జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9వ తేదీ సాయంత్రం 05.00 గంటల లోగా తెలియజేయాలని చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఇటీవల విడుదల చేసిన ఓటర్ జాబితా పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఇంచార్జి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గత నెల డిసెంబర్ 30వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఓటర్ జాబితాను సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో డౌన్ లోడ్ చేసారని, దానిని గత నెల 31వ తేదీన వార్డుల వారీగా సిద్ధం చేశారని, జనవరి 01వ తేదీన రెండు మున్సిపల్ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులపై జాబితా అందుబాటులో పెట్టామని వెల్లడించారు. రాజకీయ పార్టీలతో జిల్లాలోని రెండు మున్సిపల్ కార్యాలయాల్లో ఈ నెల 05 వ తేదీన మీటింగ్ పెట్టామని వివరించారు. సిరిసిల్లలో మొత్తం 39 వార్డులు ఉన్నాయని, 39,942 మంది పురుష ఓటర్లు, 42,011 మహిళా ఓటర్లు, 06 ఇతర ఓటర్లు ఉన్నారని, వేములవాడలో మొత్తం 28 వార్డులు 19,580 మంది పురుష ఓటర్లు, 21,279 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 18 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ఈ నెల 10 వ తేదీన తుది ఓటర్ జాబితా విడుదల చేస్తామని ఆమె వెల్లడించారు. పలు పార్టీల ప్రతినిధులు డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి ఓటర్ల తొలగింపు, వార్డులో సీరియల్ నంబర్ వారిగా ఓటర్ జాబితా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సూర దేవరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి, బీఆర్ఎస్ ప్రతినిధి జిందం చక్రపాణి, బీఎస్పీ ప్రతినిధి ఏ రమేష్, టీడీపీ ప్రతినిధి తీగల శేఖర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, డీ టీ సీ పీ ఓ అన్సార్ పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనకు రూ.25వేల విరాళం



**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో వెలిసిన పురాతన స్వయం భూ శివాలయ అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారు. ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జంటనాగుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం కోసం మంగళవారం బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి సార్ధ నీలిమా రాణి నాగరాజు దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. మొక్కుబడిలో భాగంగా రూ. 25వేల నగదును ఆలయ కమిటీ ఛైర్మన్ ఉప్పు సురేష్‌కు వారు స్వయంగా అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతతో పాటు ఆలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి, విగ్రహ ప్రతిష్టాపన కోసం ఆర్థిక సాయం అందించిన నీలిమారాణి దంపతులకు ఆలయ కమిటీ ఛైర్మన్ ఉప్పు సురేష్ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు ఎనిమిది మంది విద్యార్థులు ఎంపిక

**ప్రజాపక్షం/తిర్యాణి :** వరంగల్ జిల్లా ఏటూరునగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలకు తిర్యాణి ఆశ్రమ పాఠశాల నుండి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో జరిగే ట్రైబల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో వీరు పాల్గొననున్నారని పాఠశాల పిడి గుండం లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులైనప్పటికీ పట్టణ విద్యార్థులతో పోటీపడి మెరుగైన ప్రతిభ కనబరిచారని కొనియాడారు. కఠిన సాధన, శారీరక దృఢత్వంతో జిల్లా స్థాయి ఎంపికల్లో సత్తా చాటారని, రాష్ట్రస్థాయిలోనూ పతకాలు సాధిస్తారన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిడి రమాదేవి, ఎటిడిఓ శివకృష్ణ, డిఎస్ఓ శేకు, ఎసిఎంఓ పూర్క ఉద్ధవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇఎస్ఐ హాస్పిటల్ ప్రతి జిల్లాలో నిర్మించాలి




తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.వి అనసూర్య

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బీడీ కార్మికులకు ఈఎస్ఐ హాస్పిటల్ ప్రతి జిల్లాలో నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేవీ అనసూర్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి రాములు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం మెదక్ జిల్లా నిజాంపేటలో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. తిరుణగరి లక్ష్మన్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర అధ్యక్షులు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి సుతారి రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో 60 లక్షల మంది బీడీ కార్మికులు, రాష్ట్రము లో 7లక్షల మంది పనిచేస్తున్నారని, అందరికి వర్ధి బీడీ లేకుండా చూడాలని అన్నారు. తునికాకు నాన్యమైనది వెయ్యాలని, ఈపీఎఫ్ఓ ద్వారా కనీసం పెన్షన్ 6 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.వి అనసూర్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి రాములు, కౌన్సిల్ సభ్యులు అజ్జ వేణు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై వ్యాసరచన పోటీలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రోడ్డు భద్రత మాస ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల కాకతీయ హై స్కూల్ సిరిసిల్ల ప్రైవేట్ పాఠశాలలలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, వాహనదారులు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 12 ప్రైవేట్ పాఠశాలలలో పాల్గొన్నాయి. రోడ్డు రవాణా ప్రమాదాలు అనే అంశంపై నిర్వహించిన క్విజ్ లో 10 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి మూడు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి జడ్జిలుగా రిటైర్డ్ అధ్యాపకులు మద్దికుంట లక్ష్మణ్, పిల్లి ధర్మయ్య, అధ్యాపకులు సిహెచ్ వెంకటేరమణ బి. వేణుగోపాల్ రావు వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రవాణా శాఖ మెంబర్ సంగీతం శ్రీనాథ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, సహాయక మోటార్ వాహనముల తనిఖీ అధికారులు బేతి రజని, పృథ్వీరాజ్ వర్మ,రవాణా శాఖ సిబ్బంది కానిస్టేబుళ్లు సౌమ్య, రమ్య, ప్రశాంత్ లు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

### కలెక్టర్ త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల పరిధిలో రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు అవసరముంటే సూచనలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రాజకీయ పార్టీలను కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ పట్టణాల పరిధిలో ముసాయిదా ఓటరు జాబితాను రూపొందించామన్నారు. ఇప్పటికే గత డిసెంబర్ 31 న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసి అన్ని మున్సిపాలిటీల వారిగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు జరిపారని గుర్తు చేశారు. వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ వాటిని పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకనూ ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే తుది జాబితాను వెలువరించక ముందే గడువులోగా తెలియజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాల్సిన వాటిని తగిన ఆధారాలు పరిశీలించి తప్పనిసరిగా సవరిస్తామని ఈ విషయంలో రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్, ఆర్మూర్ సబ్‌కలెక్టర్లు వికాస్‌మహతో, అభిగ్యాన్ మాలవియా, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, మున్సిపల్ కమీషనర్లు, గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాలువ మరమ్మతుకు రూ.1500 కోట్లు ఇవ్వండి

**ప్రజాపక్షం/నందిపేట్ :** నిజాంసాగర్ కాలువల ఆదునీకరణ కొరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి స్వయంగా కలిసి వినతి పత్రం అందజేశారు. చాలా చోట్ల కాలువలు కబ్జాకు గురవుతున్నాయని, వీటి మరమ్మత్తు కొరకు 35 కి.మీ.ల దూరం ఉన్న కాలువలకు రూ. 1500 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

## ఎడపల్లిలో చోరీ...

### తాళం వేసిన ఇంట్లో నగదు, బంగారం అపహరణ

**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో గుర్తు తెలియని దొంగలు బీభత్సం సృష్టించాయి. తాళం వేసి ఉన్న ఒక ఇంట్లోకి చొరబడి సుమారు రూ.50వేల విలువైన నగదు, బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితులు శుభకార్యానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు హైమద్ బేగ్ ఆదివారం తన సోదరి కుమార్తె నిశ్చితార్థ వేడుక కోసం కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్ వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి ప్రధాన తలుపులు విరగ్గొట్టి ఉండటాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. దొంగలు బెడ్‌రూమ్‌లోని బీరువాను పగులగొట్టి, లోపల ఉన్న విలువైన వస్తువులను అపహరించారు. సుమారు రూ. 50వేల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరికి గురయ్యాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు.

# వైభవంగా "నిర్మల్ ఉత్సవాలు"

### జనవరి 19 నుంచి వేడుకలు.. ఏర్పాట్లు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశం..!

**ప్రజాపక్షం/నిర్మల్ :** జిల్లా సాంస్కృతిక వైభవాన్ని,చారిత్రక వారసత్వాన్ని చాటిచెప్పేలా ఈ ఏడాది కూడా నిర్మల్ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది.ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.గత స్ఫూర్తితో మరింత ఘనంగా.గత ఏడాది నిర్మల్ ఉత్సవాలను అత్యంత విజయవంతంగా నిర్వహించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించిందని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.నిర్మల్ కోటలు,కొయ్యబొమ్మలు,ఇక్కడి కళా వైభవాన్ని ఉత్సవాల వేదిక ద్వారా ప్రజలకు చేరువ చేయగలిగామని ఆమె పేర్కొన్నారు.అదే ఉత్సాహంతో ఈ ఏడాది కూడా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పండుగ వాతావరణంలో జరిపించాలని సూచించారు.



### ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వేడుకలవేదిక..

ఈసారి కూడా ప్రధాన కార్యక్రమాలను ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించారు.స్టేడియం ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని,వేదిక సుందరీకరణతో పాటు సందర్శకుల కోసం మరుగుదొడ్లు,విద్యుత్ దీపాలంకరణ(లైటింగ్) వంటి మౌలిక సదుపాయాలను ఎక్కడా లోటు లేకుండా కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తులు, సందర్శకుల వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించాలని మున్సిపల్,పోలీస్ అధికారులక సూచించారు.

### విద్యార్థుల ప్రదర్శనలు-విస్తృత ప్రచారం :

జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో ప్రతిభను చాటేలా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఉత్సవాల విశిష్టతను చాటిచెప్పే జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులకు సూచించారు. జిల్లా విద్యాశాఖధికారి(డిఈవో) భోజన్న, జిల్లా యువజన క్రీడల అధికారి (డివైఎస్ఓ) శ్రీకాంత్ రెడ్డి,ఆర్ అండ్ బి ఈఈ నర్సయ్య,డీపీఆర్వో విష్ణువర్ధన్,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,ఈడీఎం నదీమ్,ఇతర అధికారులు పాల్గొన్నారు.నిర్మల్ జిల్లా ప్రజల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే ఈ ఉత్సవాల కోసం ప్రజలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వార్డుల ఓటరు జాబితాపై అభ్యంతరాలు అందించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా వార్డుల వారీగా ఓటరు జాబితాపై ఈ నెల 9వ తేదీ లోగా అభ్యంతరాలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించామని, ప్రతి ఓటరు తమ వివరాలు పరిశీలించుకోవాలని తెలిపారు. జాబితాలోని పేర్లపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 9వ తేదీలోగా రాతపూర్వకంగా సమర్పించాలన్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 13 వేల 905 మంది ఓటర్లకు 24 పోలింగ్ కేంద్రాలు, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 51 వేల 25 మంది ఓటర్లకు 83 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈనెల 10న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. టి పోల్ యాప్ లో వార్డుల వారీగా ఓటరు జాబితా పరిశీలించుకోవచ్చని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే వార్డులో ఉండేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు గజానన్, రాజేందర్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కామన్‌పల్లి మేదర సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

**ప్రజాపక్షం/జన్నారం:**జన్నారం మండలం కామన్ పల్లి, దేవుని గూడా గ్రామాలకు చెందిన మేదర సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం రెండు గ్రామాల సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. సంఘ అధ్యక్షులుగా కోడిపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా నీలి నర్సింగం, కోశాధికారిగా కోడి జుట్టు రాజన్న, ప్రచార కార్యదర్శిగా మధిర రవీందర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ సంఘ సభ్యులతో కలిసి సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/కేరమేరి:**పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు కేరమేరి ఎస్ఐ మధుకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని గొర్యగూడ (కొలంగూడ) గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వృద్ధులకు 25 దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవకు పోలీసులు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించి సహకరించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విద్య కీలకమని సూచించారు. నిషేధిత పంటలు సాగు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుమ్మగూడ సర్పంచ్ భీంరావు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నా రు.

## సమ్మక్క- సారలమ్మ జాతర వేలం ద్వారా రూ. 12.39 లక్షల ఆదాయం

**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్:**మంచిర్యాల పట్టణంలోని గోదావరి నది తీరంలో జరిగే శ్రీ సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన బహిరంగ వేలం పాటలకు విశేష స్పందన లభించింది. ఈనెల 28 నుండి 31 వరకు జరగనున్న జాతరను పురస్కరించుకొని మంగళవారం దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో వివిధ హక్కుల కోసం వేలం నిర్వహించారు. ఇందులో కొబ్బరికాయలు, పూజ సామాగ్రి, తైబజార్ నిర్వహణ, కోళ్ల విక్రయం, శీతల పానీయాలు, లడ్డు పులిహోర ప్రసాదం, బియ్యం, బెల్లం, వస్త్రాల సేకరణ హక్కుల కోసం వేలం పాటలు జరిగాయి.

# లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/బాల్కొండ:**ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన సుమారు 429 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసీఆర్ పేదవారి ఇంటిలో ఆడబిడ్డ పెళ్లయితే ప్రభుత్వం తరపున అండగా ఉండటానికి ఆయన స్వీయ అనుభవం ద్వారా పుట్టింది ఈ పథకమన్నారు. మొదట ఎస్సీలకు, బీసీలకు పేదవారు ఏ వర్గంలో ఉన్న ఏ పథకాన్ని వర్తింపజేసి 50 వేల నుండి పెట్టి 100116 మేనమామ కట్నం కింద కేసీఆర్ అందజేశారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మి ఆ పార్టీకి ఓట్లు వేశారు. అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతుంది, మేము అధికారంలోకి వస్తే లక్షతో



పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది. రెండేళ్లయినా తులం బంగారం హామీ ఇంకా నెరవేర్చలేదు. మేము మీ తరపున అసెంబ్లీలో అడిగిన ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. తులం బంగారం, మహిళలకు 2500, పెన్షన్ 4 వేల హామీలు నెరవేర్చలేదు. మహిళా సోదరీమణులు గమనించాలని సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే అన్నారు.

## పమాదవశాత్తు వలలో చిక్కుకుని ఒకరి మృతి

**ప్రజాపక్షం/లోకేశ్వరం:**లోకేశ్వరం మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన గుండ్ల చిన్న సాయన్న (50) పంచగుడి బ్రిడ్జి వద్ద ఉదయం 6 గంటలకు చేపలు పట్టడానికి వెళ్లి



వలలో చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందారు.ఎస్సై అశోక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడతామన్నారు.

# రక్తదానం మిన్నయైన దానం : డాక్టర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:**రక్తదానం కంటే గొప్ప దానం మరొకటి లేదని, ఒకరు ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాలను కాపాడుతుందని జిల్లా బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కాగజ్ నగర్ పట్టణంలోని అగ్రసేన్ భవన్‌లో మార్వాడి యువమంచ్ అధ్యక్షులు అరుణ్ లోయ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన, ఆరోగ్య పరీక్షల శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం అందక పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రక్తదానం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందన్నది అపోహ మాత్రమేనని, యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుకర్ రక్తదానం చేయగా డిఎస్‌పి, తహసీల్దార్ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి




ఎం.డి. వహిఉద్దీన్, తహసీల్దార్ ఎం. మధుకర్, పట్టణ సిఐ ప్రేమ్ కుమార్, డాక్టర్ గిరిదాలాల్ ముందాడ, మార్వాడి యువమంచ్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ అసావా, కోశాధికారి శుభం లోయ, కన్వీనర్లు మురళి జవర్, సురేష్ లోయా, రమేష్ బజాజ్, మహావీర్ లోయా, శంకర్‌లాల్ ఫోఫాలియా, శివ గౌడ్, పవన్ ముందడ, జుగల్ కిషోర్ లోయా, ప్రయాగ్ తివారీ, సంతోష్ ఠాకూర్, విక్కీ చజ్జెడ్, వివేక్ బజాజ్, మంగీలాల్ బోరానా, కిషన్ జాజు, కపిల్ సోని, మురళీకృష్ణ, ఝువార్, సునీతా బజాజ్ పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు భద్రతా సూత్రాలు పాటించాలి

**ప్రజాపక్షం/తిర్యాణి:**విద్యుత్ ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు, వినియోగదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉత్తం జాడే సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక కొమరం భీం చౌరస్తాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగంపై టిఎస్ ఎన్పిడిసిఎల్ విడుదల చేసిన 37 భద్రతా సూత్రాలను పాటించాలన్నారు. విద్యుత్ మోటార్లు, స్టార్టర్లకు సరైన ఎర్తింగ్ ఉండాలని, ఈఎల్సిబి, ఆర్సిసిబి అమర్చుకోవాలని, తడి చేతులతో స్టార్టర్ ఆన్ చేయరాదని, రబ్బరు చెప్పులు తప్పనిసరిగా వాడాలని తెలిపారు. సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా ఉండాలని, నాసిరకం వైర్లు, స్విచ్‌లు వాడరాదని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు,




ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పశువులు కట్టరాదని, తెగిపోయిన కరెంట్ తీగలను తాకరాదని తెలిపారు. విద్యుత్ సమస్యలపై 1912 నంబర్ కు సమాచారం ఇవ్వాలన్నారు. పంటల రక్షణ, వేట కోసం విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రవీందర్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలి

**ప్రజాపక్షం/నస్పూర్:**ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కాకతీయ టెక్నో పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలో కాకతీయ టెక్నో పేరుతో ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్యం నిబంధనలు తుంగలో తొక్కి అమాయక తల్లిదండ్రులను మోసం చేస్తోందని ఆరోపించారు. పాఠశాలలో కనీస మౌలిక వసతులు, ఆట స్థలం, సరైన తరగతి గదులు, అగ్నిమాపక యంత్రాలు లేవని తెలిపారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటంతో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పాఠశాల భవనం నిర్వహణకు అనుకూలంగా లేదని, ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ విద్యా శాఖ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పాఠశాలను సీజ్ చేసి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.

## అంగన్‌వాడి పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాపక్షం/జన్నారం :**అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ సంగీత, కార్యదర్శి లావణ్య సూచించారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ అంగన్వాడీ కేంద్రం 1లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం తల్లితో పాటు పిల్లల ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రోగ నిరోధక శక్తి పెంపొందేందుకు పౌష్టికాహారం మేలు చేస్తుందని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సంజీవరాణి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరిస్తేనే ప్రయాణం సురక్షితం



**ప్రజాపక్షం/కౌటాల:**ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం సురక్షితం చేసుకోవాలని కౌటాల సిఐ సంతోష్, ఎస్ఐ చంద్రశేఖర్ సూచించారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి నితికా పంథ్ ఆదేశాల మేరకు, సిఐ సంతోష్ ఆధ్వర్యంలో మంగళవారం మినీ స్టేడియం నుండి తలోడి చౌరస్తా వరకు హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రాణ రక్షణ కోసం ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారణమవుతాయని పేర్కొన్నారు. రోడ్డు భద్రత అనేది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తేవాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్:అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆకాంక్షించారు. మహారాష్ట్రలోని సంఘంనేర్ గ్లోబాల్ స్కూల్ లో డిసెంబర్ 30 నుండి జనవరి 2 వరకు జరిగిన యోగాసనా భారత్ జాతీయ స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన సిహెచ్ ఏడుకొండలు (యోగి) కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ సీనియర్ బి విభాగం లెగ్ బ్యాలెన్స్ ఈవెంట్ లో ఏడుకొండలు తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. గత ఆగస్టులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు.

## నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**ప్రజాపక్షం/లక్ష్మ ణచందా:** వడ్యాల్ గ్రామాభివృద్ధిలో భాగంగా మంగళవారం నాడు పురాతన ఇనుప విద్యుత్ స్తంబాలను తొలగించి నూతనంగా 4 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ పర్యవేక్షణలో భాగంగా గ్రామ సర్పంచ్ పసుపుల నరేష్, మండల ఏఈ మహేష్, లైన్మెన్ రవితేజ, ఇతర సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**ప్రజాపక్షం/కౌటాల:** విద్యార్థులకు మధ్యాహ్న భోజన మెను పాటిస్తూ నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి గావుడే హన్మంతు సూచించారు. బెజ్జూర్ మండలంలోని ముత్తంపేట్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల బండల్ హెట్టి ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ప్రీ ప్రైమరీ విద్యార్థుల పఠన నైపుణ్యాలను, హోంవర్క్, ఫెయిర్ నోట్స్ పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు రకాల సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిఆర్పి గంధం ప్రకాష్ ఉన్నారు.

## కడ్తాల్ ఉపసర్పంచ్‌ను సన్మానించిన మాజీ చైర్ పర్సన్ దంపతులు

**ప్రజాపక్షం/సోన్:** సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామ ఉపసర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైనా పుట్టి అక్షయ సాయిరాం దంపతులను మంగళవారం ఇందిరానగర్‌లో ఘనంగా సన్మానించారు.ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ వి.శోభారాణి, నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి.సత్యనారాయణగౌడ్ దంపతులు వారిని శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శోభారాణి,సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధిలో ఉపసర్పంచ్ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజలతో,పాలకవర్గంతో ఎప్పటికప్పుడు మమేకమవుతూ,నిస్వార్థంగా సేవలందించి గ్రామాన్ని ప్రగతిపథంలో నడిపించాలని సూచించారు.ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుండిపోయేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో సమర్థవంతంగా పనిచేయాలని వారు ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బర్మ రాజ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో 83 చోరీ మొబైల్ ఫోన్ల రికవరీ

### బాధితులకు అందజేసిన ఎస్పీ డా.జి.జానకి షర్మిల




**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచి,సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి 83 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు.వీటి విలువ సుమారు తొమ్మిది లక్షల తొంభై ఆరు వేల రూపాయలుగా ఉంది.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ ఈ ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,910 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామని,వీటతి మొత్తం విలువ సుమారు రెండు కోట్ల ఇరవై తొమ్మిది లక్షల ఇరవై వేల రూపాయలు ఉంటుందని వెల్లడించారు.మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా వినియోగదారులు ఆందోళన చెందకుండా వెంటనే (www.ceir.gov.in) వైబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.పోయిన ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని,పోలీస్ స్టేషన్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా పోర్టల్ సహాయంతో మొబైల్స్‌ను సులభంగా వెలికితీయవచ్చని తెలిపారు.మొబైల్ ఫోన్ల పట్ల అశ్రద్ధ వహిస్తే అది వ్యక్తిగత భద్రతకు ముప్పుగా మారుతుందని,ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అవి ఎక్కడి నుండి వచ్చాయో సరిచూసుకోకుండా కొంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు.ముఖ్యంగా తక్కువ ధరకే వస్తున్నాయని అనుమానాస్పద వ్యక్తుల వద్ద ఫోన్లు కొనరాదని,విక్రయదారుల వివరాలు తెలుసుకోవాలని సూచించారు.చోరీ ముఠాలను గుర్తించేందుకు సెకండ్ హ్యాండ్ మొబైల్ విక్రయాలపై కఠిన నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు.ఎవరికైనా సెల్ ఫోన్లు దొరికితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని కోరుతూ,ఫోన్ల రికవరీలో కీలక పాత్ర పోషించిన ఐటి కోర్ సిబ్బందిని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

# గని కార్మికులకు రూ.25 లక్షల గ్రాట్యూటీ చెల్లించాలి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి అధికారులకు మాదిరిగానే బొగ్గు గని కార్మికులకు కూడా బేషరతుగా రూ.25 లక్షల గ్రాట్యూటీ చెల్లించాలని ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు. ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు ఎన్‌సిడబ్ల్యూఎ కార్మికులకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు జాతీయ స్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 25 లక్షల గ్రాట్యూటీకి కనీసం 50 శాతం డిఏ ఉండాలనే షరతుతో కోల్ ఇండియా సర్క్యులర్ విడుదల చేసిందని తెలిపారు. ఎన్‌సిడబ్ల్యూఎ కార్మికులకు ఐదు సంవత్సరాల వేతన ఒప్పంద కాలంలో కేవలం 23.1 శాతం డిఏ మాత్రమే ఉండటం వల్ల ఈ గ్రాట్యూటీ ప్రయోజనం వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు పది సంవత్సరాల పే రివిజన్ కారణంగా 51.3 శాతం డిఏ పెరిగిందని, తద్వారా వారికి రూ.25 లక్షల గ్రాట్యూటీ వర్తిస్తుందని వివరించారు. గతంలో ఎప్పుడూ గ్రాట్యూటీ సీలింగ్‌ను డిఏతో లింక్ చేయలేదని, కార్మికులకు అన్యాయం చేసేందుకే కేంద్రం ఇలా చేసిందని, దీనిని ఐఎన్టియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వేదం గ్లోబల్ విద్యార్థుల ప్రభంజనం




**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** కరీంనగర్ పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ వేదికగా అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ''తెలంగాణ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2026 '' పోటీల్లో వేదం గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచి తమ సత్తాచాటారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పోటీపడి,స్కూల్ విద్యార్థులు పతకాల పంట పండించడం విశేషం.ఈ టోర్నమెంట్‌లో భాగంగా నిర్వహించిన కటా విభాగంలో ఏడవ తరగతి విద్యార్థి రిత్విక్,ఆరవ తరగతి విద్యార్థి సుశాంత్ తమ అత్యుత్తమ నైపుణ్యంతో బంగారు పతాకాలను కైవసం చేసుకున్నారు.అదే విభాగంలో ఆరవ తరగతికి చెందిన రీతుల్, ఐదవ తరగతికి చెందిన విహాన్ కాంస్య పతకాలను సాధించి స్కూల్ కీర్తిని చాటారు.కుంటే విభాగంలోనూ విద్యార్థులు పోరాట పటిమను ప్రదర్శించి విశేష విజయాలను అందుకున్నారు.ఎనిమిదవ తరగతికి చెందిన డి.మనితేజ తమ ప్రత్యర్థులపై పైచేయి సాధించి ప్రథమ స్థానంతో పాటు విజేత ట్రోఫీలను గెలుచుకున్నారు.ఐదవ తరగతి విద్యార్థి విశాల్,ఎనిమిదవ తరగతి విద్యార్థి భరద్వాజ్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించగా,ఏడవ తరగతికి చెందని నిత్యా,ఐదవ తరగతికి చెందిన ఎల్.మనస్విట్ తృతీయ స్థానాలను దక్కించుకున్నారు.విజేతలకు గోజోరియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు,చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురభి వేణుగోపాల్, ఇందిరా సురభి, ఈవెంట్ ఆర్గనైజర్ అన్వేష్ రెడ్డి బహుమతులను ప్రదానం చేసి వారికి అభినందించారు. విద్యార్థుల ఈ ఘన విజయం పట్ల వేదం గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ కే. భూపాల్, ప్రిన్సిపల్ శ్వేత వీణ హర్షం వ్యక్తం చేశారు.చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించడం వల్ల విద్యార్థులో అత్మవిశ్వాసం క్రమశిక్షణ పెరుగుతాయని వారు పేర్కొన్నారు.ఇంతటి గొప్ప విజయాన్ని సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దిన కరాటే మాస్టర్లను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

# ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన

**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్:** రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎయంవిఐ) రజనీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా ''రహదారి భద్రతఅవగాహన'' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ రజనీకాంత్ తో పాటు అక్షయ్,రణశ్రీ మేడం ముఖ్య అతిథులుగా హాజరై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆటో డ్రైవర్లు అతివేగంగా వాహనాలను నడపరాదని,మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్లు వాడకూడదని,ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలని కోరారు.డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్,ఇన్సూరెన్స్ వంటి పత్రాలను కలిగి ఉండాలని,మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాలకు ముప్పని తెలిపారు.ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్ల మీద ఉందని,ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా భావించాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## గోపాలమిత్ర సేవలతో పశుగర్భకోశ చికిత్సా శిబిరం

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్:** గోపాలమిత్ర సేవలతో పశుపోషకులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని పశు వైద్యాధికారి రాకేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని బొంబాయి గూడ గ్రామంలో ఆదిలాబాద్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశుగర్భకోశ చికిత్సా, అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో నట్టల నివారణ మందులు, ఎదకు వచ్చే మాత్రలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువుల పరిశీలన పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే పాల దిగుబడి పెంచే మందులను పంపిణీ చేశామని పేర్కొన్నారు. పశుపోషకులు తమ పశువులను శిబిరానికి తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమాదేవి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అడవి జంతువులు అడ్డుగా వచ్చి రోడ్డు ప్రమాదం

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:** నిర్మల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులను లోలం గ్రామ శివారులో అకస్మాత్తుగా అడవి జంతువుల గుంపు అడ్డుకోవడంతో తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో నర్సాపూర్ (జి) గ్రామానికి చెందిన గడ్డం నితిన్(27) అక్కడికక్కడే మృతి చెందగా,అదే గ్రామానికి చెందిన నీరాటి హర్షిత్ రాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,గడ్డం నితిన్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తుండగా,ద్విచక్ర వాహనం(టీఎస్ 18జీ6647) పై నిర్మల్ వైపు వెళ్తున్న సమయంలో లోలం అవుట్‌స్కర్ట్స్ లో అడవి జంతువులు రోడ్డుపైకి దూసుకొచ్చాయి.దీంతో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది.స్థానికులు వెంటనే గాయపడిన హర్షిత్ రాజ్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.మృతుడి తండ్రి గడ్డం పొట్టెన్న ఫిర్యాదు మేరకు దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి,ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగిస్తున్నారు.గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



**ప్రజాపక్షం/సిర్పూర్‌టి:** సిర్పూర్ టీ మండలంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్ఐ సురేష్ సూచించారు. మంగళవారం సిర్పూర్ టి బస్‌స్టాప్ నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని నివారించేందుకు హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి వాహనదారుడు నాణ్యమైన హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం వల్ల ప్రమాదాలు తీవ్రంగా జరుగుతున్నాయని, ప్రజలు స్వచ్ఛందంగా భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**పెంచికల్‌పేట్ :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి సూచించారు. మంగళవారం పెంచికల్‌పేట మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ప్రధాన వీధుల గుండా ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి (ఎస్ఓ) కవిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు, తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భక్తు రాంచందర్, పోలీస్ సిబ్బంది, పలువురు గ్రామ నాయకులు, వాహనదారులు పాల్గొన్నారు.

## నందిపేట్ బంద్ ప్రశాంతం

**ప్రజాపక్షం/నందిపేట్:**నందిపేట్ మండల కేంద్రంలో బస్సు డిపో కొరకు అఖిల పక్షం చేపట్టిన బంద్ విజయవంతంగా ముగిసింది. 1998లో మండలంలో ఇంటికి ఐదు రూపాయలు జమచేసి ఐదున్నర ఎకరాలు స్తానిక బస్టాండ్ పక్కన కొన్నారు. అప్పట్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా ఉన్న మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శంకుస్తాపన చేశారు. తెలంగాణ రావడంతో మరిచిపోయారు. మళ్లీ అఖిలపక్షం ముందుకు వచ్చి బంద్‌కు పిలుపునిచ్చింది. అన్ని పార్టీలు సహకరించి బంద్‌ను మంగళవారం విజయవంతం చేశాయి. నందిపేట్ ఎస్ఐ ఆద్వర్యంలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. బస్సులు యధావిదిగా నడిచాయి. వ్యాపార సంస్తలు, ప్రయివేటు పాఠశాలలు బంద్ పాటించాయి. ఎవరికి ఇబ్బంది జరగలేదు. ఈ విషయంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి బస్సు డిపో గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు.

## హోంగార్డ్ దేవయ్య కుటుంబానికి అండగా ఉంటాం

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** హోంగార్డ్ దేవయ్య కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. హోంగార్డు దేవయ్య అంత్యక్రియలలో పాల్గొని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 26 సంవత్సరాలు పోలీస్ శాఖలో విధులు నిర్వహించిన ఆయన మరణం తీరని లోటన్నారు. సోమవారం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో సిరిసిల్ల బైపాస్ రోడ్డులో క్రషర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగి మరణించడం బాధాకరమన్నారు. ఆయనకు భార్య నలుగురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్ర చారి, సి.ఐ లు నాగేశ్వరరావు, రవి, మొగిలి, ఆర్.ఐ మధుకర్,యాదగిరి, రమేష్, ఎస్.ఐ ఉపేంద్రచారి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ముధోల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏఎస్పీ

**ప్రజాపక్షం/ముధోల్:**బైంసా ఏఎస్పీ రాజేష్ మీనా మంగళవారం ముధోల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులు అందిన వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.అదే విధంగా ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా జవాబుదారీతనంగా పోలీసులు విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. నేరాలను నియంత్రించడానికి ప్రజలను అగాహన పరచాలన్నారు.అంతే కాకు ఒడా నేరాల నియంత్రణలో ప్రజల సహకారం సైతం పోలీసులకు అవసరమని వెల్లడించా రు.ఎప్పటికప్పుడు రికార్డులను తనిఖీ చేస్తూ వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.గ్రామాల్లో నిరంతరం పెట్రోలి ంగ్ జరపాలని సిబ్బందికి సలహాలు,సూచనలు అందించారు.



## ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి



**ప్రజాపక్షం/దిలావర్పూర్:**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే యథావిధిగా కొనసాగించాలని కోరుతూ తెలంగాన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దిలావర్పూర్ మండలం కంజర గ్రామంలో గ్రామ కార్యదర్శి సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమానికి కంజర్ గ్రామ సర్పంచ్ షేర్ చందు,గ్రామ ఉపసర్పంచ్,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బరికుంట గంగారం నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.2005 లో యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు 100 రోజుల ఉపాధిని చట్టబద్ధంగా కల్పించిందన్నారు.అయితే 2025 లో కేంద్ర ప్రభుత్వం పథకం పేరును మార్చి కొత్త చట్టాన్ని తీసుకురావడం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ఇంతకుముందు కేంద్ర ప్రభుత్వం 90 శాతం,రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు అందించేదని,ఇప్పుడు కేంద్రం తన వాటాను తగ్గించి రాష్ట్రాలపై భారం మోపుతోందన్నారు.సరైన సమయంలో కూలీలు చెల్లించకపోవడం,పనిదినాలను తగ్గించడం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా రద్దు చేసే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు.కావున ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలో కొనసాగించాలని,సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని,రోజువారీ కూలీని రూ.800కు పెంచాలని,కొత్తగా తీసుకువచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ గ్రామ మహిళా కమిటీ నాయకురాలు షేర్ లహరి,పూసల నరసవ్వ,నిమ్మ లావణ్య,మూడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా కార్యకర్తలతో సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/బోధన్:**రానున్న మున్సిపల్ ఎలక్షన్ దృష్ట్యా బోధన్ పట్టణంలోని ఎంపీఆర్ కార్యాలయంలో బిజెపి కార్యకర్తలతో పట్టణ అధ్యక్షుడు గోపి కిషన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసే బిజెపి కార్యకర్తలు గట్టిగా ప్రయత్నం చేసి బోధన్ మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని సూచించారు. దేశంలో ప్రజలు మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పట్టణ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకొని సమిష్టి కృషితో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, మేయర్ పీఠం బిజెపి పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షునికి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాంచందర్, ఐటిసెల్ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్, పట్టణ మాజీ అధ్యక్షులు బాలరాజు, వినోద్, అరవింద్, విజయ్, హన్మండ్లు చారి, గంగాధర్, సందీప్‌కృష్ణ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ట్రంప్ దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మథురో,ఆయన భార్య సిరియా ఫ్లోరస్‌ను అమెరికా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ ఆధ్వర్యంలో నిర్మల జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ నిరసన చేపట్టారు.జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద అమెరికా సామ్రాజ్యవాద ధోరణికి నిరసిస్తూ,ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను నాయకులు దగ్ధం చేశారు.ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ..అమెరికా తన ప్రపంచాధిపత్యం కోసం వెనుకబడిన దేశాలపై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు.ముఖ్యంగా ఖనిజ వనరులు,చమురు సంపద పుష్కలంగా ఉన్న వెనిజులా వంటి దేశాలను ఆక్రమించుకోవడానికి యుద్ధాలను ప్రేరేపిస్తూ,ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడిని బంధించడం దారుణమని మండిపడ్డారు.అమెరికా తన సామ్రాజ్యవాద దురాక్రమణ ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని,లేనిపక్షంలో ప్రపంచవ్యాప్త పోరాటాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.వెనిజులా దేశానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని,అమెరికా ఆధిపత్య పోకడలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యం కావాలని రాజన్న పిలుపునిచ్చారు.ఈ విషయంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి,అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకురాలు గంగామణి,పి.B లక్ష్మి , తస్రీన్, రుక్మ, చిట్టి, వసంత, కవిత తదితరులు పాల్గొని అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు.

## ఎన్నికల కక్షతో వ్యవసాయ బోరు ధ్వంసం



**ప్రజాపక్షం/చెన్నూర్/ మంచిర్యాల:**రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఓ రైతు వ్యవసాయ బోరును ధ్వంసం చేసిన ఘటన మండలంలోని సుందరశాల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై యాదవ జెఏసి రాష్ట్ర అధ్యక్షులు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి రాష్ట్ర నాయకులు సిద్ధి రమేష్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుందరశాల గ్రామానికి చెందిన రైతు నరిగే మొండి గత 20 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వలేదనే కారణంతో అదే గ్రామానికి చెందిన గుండా సత్యనారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు రైతు బోరును ధ్వంసం చేశారని ఆరోపించారు. జనవరి 1న బోరు పైపులు పీకివేయగా బాధితుడు చెన్నూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచన మేరకు పైపులు బిగించుకుని నీరు పారించుకోగా దుండగులు మళ్లీ బోరును ధ్వంసం చేశారని వాపోయారు. బోరు పని చేయకపోవడంతో 8 ఎకరాల పంట ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితుల నుండి తమకు ప్రాణహాని ఉందని బాధితుని కుటుంబ సభ్యులు భయాందోళన చెందుతున్నారు. వెంటనే రైతు బోరును పునరుద్ధరించి, బాధితుని కుటుంబాన్ని ఆదుకోవాలని సిద్ధి రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

## తరగతుల పరిశీలన



**ప్రజాపక్షం/బాల్కొండ:** మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను సబ్‌కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ఇంటరాక్టివ్ అయి విద్యార్థులకు బోధన ప్రక్రియ పరిశీలించామని, పరిసరాలు, వంటగది తదితర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధనను పరిశీలించి పాఠశాల బృందాన్ని అభినందించారు.

## డయాలసిస్ కేంద్రాలను సందర్శించిన నిమ్స్ నెఫ్రాలజీ వైద్యుల బృందం

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :**నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఉన్న డయాలిసిస్ కేంద్రాన్ని మంగళవారం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగం వైద్యుల బృందం సందర్శించింది.అనంతరం ఖానాపూర్,బైంసా,పట్టణాల్లోని డయాలిసిస్ కేంద్రాలను కూడా సందర్శించి అక్కడి వైద్య సేవలను సమీక్షించారు.ఈ సందర్భంగా నిమ్స్ వైద్యులు ప్రతి రోగితో వ్యక్తిగతంగా మాట్లాడి,చికిత్స అందుతున్న తీరును,వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు.నిమ్స్ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అన్షుల్ మాట్లాడుతూ..డయాలిసిస్ రోగులకు నిరంతరం మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.రోగులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే 'టెలిమెడిసిన్' సౌకర్యం ద్వారా నిమ్స్ నెఫ్రాలజీ నిపుణులతో నేరుగా మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.డయాలిసిస్ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాలసింగ్,నిమ్స్ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అనికేత్,సీనియర్ మేనేజర్(ఆపరేషన్స్)కిషన్,క్వాలిటీ అస్యూరెన్స్ మేనేజర్ జీవన్,డయాలిసిన్ ఇన్చార్జ్ సాయితేజ,ఆరోగ్యశ్రీ టీఎల్ భూమారెడ్డి,డయాలిసిస్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో బోధన్ తహసీల్దార్ విఠల్, సీడీపీఓ తో కలిసి, రాబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు కార్యకలాపాలు, ఓటర్ల మ్యాపింగ్, సంతాన చేర్పు (ప్రోజెనీ అడిషన్) అంశాలపై బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పురోగతిని సమీక్షించి, ఓటర్ల మ్యాపింగ్ సంతాన చేర్పు శాతం పెంచాలని బిఎల్ఓలకు సూచించారు. నిర్ణీత కాల వ్యవధిలో లక్ష్యాలను పూర్తి చేయడానికి ప్రతిరోజు లక్ష్యాలను నిర్ధారించారు. తక్కువ పురోగతి నమోదు చేసిన బిఎల్ఓ లకు తక్షణ సరిదిద్దు చర్యలు తీసుకొని పనితీరును మెరుగు పర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో సరిపడా యూరియా

మంచిర్యాల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కృష్ణ

**ప్రజాపక్షం/జన్నారం:**మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎలాంటి అవాంతరాలు లేకుండా సరఫరా చేస్తున్నామని మంచిర్యాల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కృష్ణ తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చింతగూడ రైతు వేదికలో యూరియా వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా వాడకంపై రైతులకు తగు సూచనలు చేశారు. అనంతరం రైతులకు సబ్సిడీపై వేప నూనె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు గోపి, మండల వ్యవసాయ అధికారి అంజిత్, వ్యవసాయ విస్తరణ అధికారి లవణ కృష్ణ, చింతగూడ సర్పంచ్ సుతారి సుమలత వినయ్, రొటీగూడ ఉపసర్పంచ్ గాజుల సత్తన్న, రైతులు పాల్గొన్నారు.

## బిఎన్‌కెఎస్‌ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మంథని ఎ ఎల్ ఒ రవీందర్

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మిక సమైఖ్య సంఘం (ట్రేడ్ యూనియన్) జిల్లా నాయకుల ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ను జిల్లా ఉపాధ్యక్షులు తిరునహరి రాజు ఆధ్వర్యంలో మంథని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవీందర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను కార్మికులందరూ వినియోగించుకోవాలని అన్నారు. కార్మికులందరూ తప్పనిసరిగా లేబర్ కార్డు చేయించుకోవాలని, లేబర్ కార్డు సమయం అయిపోకముందే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కార్మికులకు లేబర్ కార్డు పరంగా ఎటువంటి సమస్యలు ఉన్న ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్య పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి ఇటిక్యాల సుధాకర్,జిల్లా కమిటీ మెంబర్ రాచర్ల చంద్రమౌళి, మంథ ని మండల అధ్యక్షులు చింతకింది శంకర్, ఆఫీస్ అసిస్టెంట్ రాములు పాల్గొన్నారు.

## పొలంబాట కార్యక్రమం నిర్వహించిన విద్యుత్ అధికారులు

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని దర్యాపూర్ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలంబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిఈ ప్రభాకర్, ఏఈరాజేందర్,ఎస్ ఈ సంతోష్ రెడ్డి గ్రామ పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు.వ్యవసాయ బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లలో ఎటువంటి అంతరాయం తలెత్తినా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని రైతులకు తెలిపారు. అలాగే విద్యుత్ వినియోగించే సమయంలో భద్రతా చర్యలు పాటించాల ని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపెల్లి రాజయ్య, రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు

## పీర్ పహాని దర్గా ఉరుసు ఉత్సవాలు

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలంలోని బేగంపేట గ్రామంలో గుట్ట పై సయ్యదినా పీర్ పహాడీ బాబా దర్గా ఉరుసు ఉత్సవాలు నిర్వాహకులు ఆదివారం రాత్రి రోజున ప్రారంభించారు కవ్వాలి, దువాలు ఫాతిహా ముస్లిం ఆచారాల ప్రకారం జరిగాయి స్వామివారికి కు బేగంపేట, వరంగల్ సిర్పూర్ కగజ్నగర్, కమాన్ పూర్ ,పెద్దపల్లి , గోదావరిఖని తదితర ప్రాంతాల నుంచి గంధం తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు సోమవారం పీర్ పహాడ్ వద్ద దర్గా ప్రాంగణంలో జాతర నిర్వహించారు ఈ ఉర్సు ఉత్సవాలకు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల నుండి హిందూ,ముస్లిం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు రెండు రోజులు మత సమర్ధానికి ప్రతీకగా ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

# వరి నారుమడి రక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి అనూష



**ప్రజాపక్షం/ముత్తారం :** వరి నారుమడి రక్షణ జాగ్రత్తలు తప్పనిసరి తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనూష అన్నారు. మంగళవారం ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు సంబంధించిన నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా నారు సరిగా పెరగకపోవడం,అకులు ఎరుపు రంగులోకి మారడం,జింక్ లోపం కూడా గమనించవచ్చు. ఈ సమస్యలు తలెత్తకుండా సాయంత్రం వేళ నారుమడి లో నీరు పూర్తిగా తీసివేసి పగటి వేళ నీటిని పెట్టుకోవాలని,జంక్ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే లీటర్ నీటిలోరెండు గ్రాముల చొప్పున జింక్సల్ఫేట్ కలిపి పిచికారి చేయాలని, అదేవిధంగా ఇనుపధాతు లోపం వల్ల లేత ఆకులు తెల్లగా మారడం గమనించినట్లైతే అన్నభేది 5 గ్రాముల నిమ్మ ఉప్పు 1 గ్రాముల లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు.

# జాప్యం లేకుండా సిఎంపిఎఫ్ సేవలు



**ప్రజాపక్షం/రామగిరి :** మంగళవారం జి.ఎం కార్యాలయ ం నందు సంబంధిత అధికారులు, ఉద్యోగులతో ప్రయాస్ ఐదవ షెడ్యూల్ లో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.ముందుగా కమిషనర్ ఎన్ సి డ బ్యు ఎ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 241 పిపిఓ ఆర్డర్స్ ను రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావుకు అందజేశారు.ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ డా: గోవర్ధ మాట్లాడుతూ సిఎంపిఎఫ్ లావాదేవీలు అన్ని సికేర్స్ పోర్ట ల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. పెండింగ్ లోఉన్న సిఎంపిఎఫ్ క్లెయిమ్స్, రివైజ్డ్ పెన్షన్ తదితర అంశాలపై చర్చించారు, ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్ సీఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలనీ చెప్పారు.రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సీఎంపిఎఫ్ వివరాలను చూసే సిబ్బంది సీఎంపిఎఫ్ అధికారులతో సమన్వయం తో పనిచేయాలని, ఉద్యోగుల ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా చూడాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు.కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివై పియం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పిఓ పి.రాజేశం, ఫైనాన్స్ అధికారి భరత్, సిఎంపిఎఫ్ సిబ్బంది కామేశ్వర రావు, లలిత, అనిత, మనోహర్, ప్రదీప్ రెడ్డి తో పాటు వివిధ గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణకు కెసిఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలి

రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అయ్యప్ప స్వామి దీవెనలు ఈ ప్రాంత ప్రజలపై, కార్మికులపై, కర్షకులపై ఉండాలనీ, తెలంగాణకు మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేలా ఆ అయ్యప్ప దీవించాలనీ రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అయ్యప్పస్వామిని వేడుకున్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ 31 వ సారి అయ్యప్ప స్వామి మాలధారణ తీసుకుని 41 రోజుల మండల దీక్షను పూర్తి చేసుకుని స్థానిక అయ్యప్పస్వామి వారి ఆలయంలో ఇరుముడి ధరించి శబరిమలై బయలుదేరిన సందర్భంగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వారి కుమారుడు మణిదీప్ తో కలిసి గోదావరిఖని శ్రీ కోదండరామలయంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి చేత పూజ కార్యక్రమాలను నిర్వహించి, ఇరుముడి కట్టుకుని కుటుంబ సభ్యుల, అభిమానుల, BRS పార్టీ నాయకుల సమక్షంలో ఇరుముడితో శబరిమలైకు బయలుదేరారు. అంతకుముందు ఇరుముడితో అయ్యప్ప ఆలయంలో, శివాలయంలో, రామాలయంలో ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పాముకుంట్ల భాస్కర్, పెంట రాజేష్, నారాయణదాసు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, బాదే అంజలి, గాధం విజయ, బోడ్డుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కమిటీలలో నియామకం కోసం దరఖాస్తుల స్వీకరణ




**ప్రజాపక్షం/కరీంనగర్ :** జిల్లా కాంగ్రెస్, కరీంనగర్ కార్పొరేషన్ కమిటీల లో నూతన నియామకం కోసం ఆశావాహుల నుండి మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం లో పిసిసి ప్రతినిధులు నమిండ్ల శ్రీనివాస్, గౌస్ పాషా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టిఏ నెంబర్ పడాల రాహుల్ లు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత పది సంవత్సరాల నుండి పార్టీ కోసం కష్టపడిన వారు జిల్లా కాంగ్రెస్/ కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీలలో వివిధ పదవుల కోసం ఆశావాహులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, పార్టీని నమ్ముకుని ఉన్నవారికి పార్టీ కమిటీలలో పదవులు ఇవ్వడంతో పాటు, దేవస్థానాలు, వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను నామినేట్ చేసి అధిష్టానం అందరికీ న్యాయం చేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ తాజ్, శ్రావణ్ నాయక్, సిరాజుద్దీన్, ఎస్ఏ మోసిన్, అహమ్మద్ అలీ, అబ్దుల్ రహమాన్, సిరిపురం నాగప్రసాద్ తో పాటు భారీ సంఖ్యలో ఆశావహులు హాజరైనారు.

## చేతిపంపు ప్రారంభించిన బిజెపి నాయకులు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామంలోన బస్టాండ్, కమాన్, యాదవ వాడలో మంచినీటికి ఇబ్బంది పడుతున్న సమస్యను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్‌కు విషయం తెలుపగా వెంటనే స్పందించిన ఆయన చేతిపంపును మంజూరు చేశారు. చేతిపంపుకు మంగళవారం మోటార్ బిగించి బిజెపి నాయకులు ప్రారంభించారు. ఈ సంధర్బంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బిజెప మాజీ మండల అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్, ఎలగందుల మాజీ ఉపసర్పంచ్ బోనాల నరేష్, బోనాల అంజయ్య, జంగిలి రాజు, గడ్డిశేఖర్, జంగిలి రవ, గుండా సిద్దు, మిట్ట వంశీ, రమేష్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షునిగా బత్తిని సంపత్‌గౌడ్

**ప్రజాపక్షం/చొప్పదండి:** బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమకారుడు బత్తిని సంపత్‌గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నియామకపత్రం అందజేశారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో చొప్పదండి మున్సిపాలిటీపై బిఆర్ఎస్ జెండా ఎగరేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసిలు ఇప్పనపల్లి సాంబయ్య, మాచర్ల సౌజన్య వినయ్, మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కొత్తూరు మహేష్, మాదూరి శ్రీనివాస్, నలుమాచు రామకృష్ణ, మహేశుని మల్లేశం, దండె కృష్ణ, కొత్త గంగారెడ్డి, యండి అజ్జు, అమరగొండ తిరుపతి, యండి జహీర్, కొక్కుల రామ్మోహన్, చెట్టుపల్లి పద్మ, పెద్దెల్లి అనిల్, పోరండ్ల నితీష్, మావురపు మహేష్, నరేష్, రావణ్, దగడ్ శేఖర్, విలాసారం శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థినులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు దీక్షిత్ శ్రీనివాస్ అధ్యక్షతన స్నేహిత ఫేస్ 2 కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా చొప్పదండి మెడికల్ ఆఫీసర్ బి.సురేందర్ హాజరై విధ్యార్థులు స్నేహిత కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటూ శారీరకంగా, మానసికంగా ఎదగాలని కోరారు. గ్రామ సర్పంచ్ వడ్లూరి లక్ష్మి భూమయ్య మాట్లాడుతూ విధ్యార్థినులు ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. అప్పుడే మహిళాసాధికారత సాధ్యమవుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ దీక్షిత్ మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించారు. పాఠశాలలో గ్రీవెన్స్ బాక్సుల ఏర్పాటును తెలియజేశారు. ఆర్నకొండ విపివో ప్రియాంక, వివో నర్మద, చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్ ఉమాదేవి, లక్ష్మణ్‌కుమార్, రాజమౌళి, గంగాధర్, వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్ ,లక్ష్మి, అనిత, చంద్రశేఖర్, కిషన్, మీనాక్షి, సిఆర్‌పి అశోక్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, విధ్యార్థులున్నారు.

## బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా నియామకం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా వేంపల్లి గ్రామానికి చెందిన గోపినేని రాజేందర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యంలో బిజెపి మండల శాఖ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి నియామక ఉత్తర్వులను జారీ చేశారు జారీ చేసి పార్టీ పరిష్టతకు కష్టపడి పని చేయాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు మండల బిజెపి నాయకులకు రాజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లావత్ రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మండల మహిళ అధ్యక్షురాలు సత్తమ్మ, దివాకర్ రెడ్డి, రాజు యాదవ్, శేఖర్‌రులున్నారు.

## మండల స్థాయి ప్రజ్ఞ పాటవ పోటీలు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మండల స్థాయి 10వ తరగతి విద్యార్థుల ప్రజ్ఞా పాటవ పోటీలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలలో జెడ్పిహెచ్ఎస్ గోదూరు ప్రథమ స్థానంలో నిలువగా ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచినట్టు మండల విద్యాధికారి బండారి మధు తెలిపారు. అనంతరం ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి మధు కళాశాల ప్రిన్సిపల్ ఏ సంజీవ్ బహుమతి ప్రధానోత్సవం చేయడంతో పాటు ఈ పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమొంటో తో పాటు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇంటర్ విద్యాధికారి బి నారాయణ, ఎంపీడీవో సిహెచ్. గణేష్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహా గణపతికి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం పట్టణంలోని శ్రీరామపాద క్షేత్రం రాముని గుండాల కొండ కింద స్వయంభూగా వెలిసిన శ్రీమహా గణపతికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి కొండపల్కల నరేష్ ఆచారి ఆధ్వర్యంలో సంకష్టహర చతుర్థి పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ప్రతి ఆదివారం, బుధవారం, ప్రతినెల పౌర్ణమి తర్వాత 4వ రోజున సంకష్టహర చతుర్థి పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎస్.ఐ. సంధ్యారాణి, ఆలయ కమిటి సభ్యులు మేడి తిరుపతి, గున్నాల శ్రీనివాస్, గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

# 'ఆరోగ్యలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోవాలి

### అంగన్‌వాడీ కేంద్రం సమావేశంలో సర్పంచ్ స్వరూప



**ప్రజాపక్షం/అంతర్గాం :** గర్భిణులు, బాలింతలు ఆరోగ్య లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన వారందరూ తప్పనిసరిగా ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజూ హాజరు కావాలని పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మూర్మూర్ గ్రామ సర్పంచి మగ్గిడి స్వరూప అన్నారు. మంగళవారం మూర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి, అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ, సహాయ కమిటి సమావేశం సర్పంచి స్వరూప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. గర్భిణులు, పిల్లల నమోదును సక్రమంగా చేపట్టాలని, అంగన్వాడీ కేంద్రానికి అందరూ వచ్చేలా చూడాలని, గర్భిణులకు టీకాలు వేసి మందులు వాడేలా చూడాలని, గ్రామస్థాయి సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాలు విజయవంతం చేయాలని సర్పంచి కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ ఐలవేణి జ్యోతి, ఉపాధ్యాయురాలు శార్వరి, విశ్రాంత ఉద్యోగి పెసరి నర్సయ్య, వీవోలు వడకాపురం శారద, యాదాళ్ల జ్యోతి, అంగన్వాడీ టీచర్ పెండ్యాల విమల, సహాయకురాలు లక్ష్మిలు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజా బాట




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్ కో ఏ డి ఈ వరుణ్ కుమార్ తెలిపారు మంగళవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల సబ్ డివిజన్లోని చిల్వాకోడూర్ సెక్షన్ పరిధిలోని లోత్తునూర్, గొల్లపల్లి సెక్షన్ పరిధిలోని నంది పల్లె గ్రామాలలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజా బాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు .విద్యుత్ సిబ్బంది గ్రామంలో పర్యటించి క్షేత్ర స్థాయిలో ఉండే విద్యుత్ సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కార దిశగా విద్యుత్ ప్రజా బాట కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .ఈ కార్యక్రమాన్ని ప్రతి మంగళ ,గురు ,శని వారాలలో సెక్షన్ లోని ఒక గ్రామంలో ఉంటుందని, ఈ కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో సమస్యల్ని అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని ఏ డి ఈ వరుణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమ సమస్యలు అధికారుల దృష్టి కి తీసుకు రావడం జరిగిందని అన్నారు. ఈ సమస్యలు పరిశీలించిన అధికారులు త్వరితగిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం ఏఈ రాజేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ ల ఫ్యూజులు మార్పిడి చేసి సరైన ఎర్తింగ్ సరిగ్గా ఉందని నిర్ధారించి విద్యుత్ సరఫరా భద్రత నాణ్యతను మెరుగుపరచామని అన్నారు .విద్యుత్ వినియోగదారులతో సమావేశమై విద్యుత్ భద్రత అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గ్రా మాల్లో బకాయి ఉన్న వ్యవసాయ సర్వీసుల బిల్లుల చెల్లింపులపై వినియోగదారులతో చర్చించి నిరంతర విద్యుత్ సరఫరా కోసం సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు .ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిష్కరించడం ,విద్యుత్ శాఖ వినియోగదారుల మధ్య సమన్వయం పెంపొందించడమే ఈ ప్రజా బాట కార్యక్రమం లక్ష్యమని తెలిపారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు ఆకుల సుమన్ గౌడ్ , విజయ రాజేశ్వర్ ,ఉప సర్పంచ్ లు, మలేష్ , గంగన్న , సబ్ ఇంజనీర్ మహేష్, ప్రవీణ్, లైన్ మెన్ శ్రీధర్, అసిస్టెంట్ లైన్ మెన్ రమేశ్, ఏడుకొండలు ,తిరుపతి ,మారుతి వార్డు సభ్యులు , రవి , రాజు,రాజు శ్రీకాంత్ ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# అధికారులు ప్రజా సేవకులుగా పనిచేయాలి

### ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** మండల గ్రామస్థాయిలో పనిచేస్తున్న అధికారులు.. అధికారులుగా కాకుండా ప్రజలకు సేవకులుగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కు తాసిల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారి విషయంలో జరుగుతున్న అలసత్వంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సర్టిఫికెట్ల జారీ విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై ప్రజల ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయని మీరేం చేస్తున్నారని తాసిల్దారును అడిగారు. తాసిల్దార్ చెప్పిన సమాధానం సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్ని రూల్స్ ప్రకారమే చేస్తున్నారా తనకు లెటర్ ప్యాడ్ పై రాసి ఇవ్వండి అసెంబ్లీలో చర్చిస్తా అంటూ ఘాటుగానే హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలే తప్ప ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు

# నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని తిరుమలపూర్ గ్రామంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రమేష్ ఉపాధ్యక్షులుగా చందు కోశాధికారిగా శ్రీనివాస్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బాధ్యతగా వ్యవహరిస్తూ సంఘ అభ్యున్నతికి పాటు పడతామని తెలిపారు నా వంతు సంఘానికి సహాయ, సహకారాలు ఉంటాయని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని సంఘంలో ఏ విధమైన సమస్యలు వచ్చినా నేను ముందుండి నడిచి సమస్యలను పరిష్కరిస్తాను అన్నారు. అనంతరం వారికి సంఘ భవనం వద్ద బోరు బావి ప్రహరీ గోడ మంజూరికై సభ్యులతో కలిసి సర్పంచ్ కాస అంజలి గంగాధర్ ఉప సర్పంచ్ మస్కం అంజయ్యను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. సర్పంచ్ అంజలి గంగాధర్ ఉప సర్పంచ్ మస్కం అంజయ్య నూతన కమిటీని ఆహ్వానించి అధ్యక్షులకు ఉపాధ్యక్షులకు సభ్యులకు శాలువ కప్పి సన్మానం చేశారు .ఈ సందర్భంగా సర్పంచ్ అంజలి మాట్లాడుతూ మీ సమస్యలు మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే మంజూరు చేపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విక్రమ్ రాజయ్య తిరుపతి సాయికిరణ్ లక్ష్మ ణ్ రాజయ్య సందీప్ రమణ రోహిత్ సుమంత్ వినయ్ వికాస్ ప్రభాకర్ రాజయ్య సురేష్ మరియు పాల్గొన్నారు.

## ప్రభావిత గ్రామాలను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలలంలో సింగరేణి ప్రభావిత గ్రామాల ను మంగళవారం రత్నపూర్ గ్రామపంచాయతీ లో లద్నాపూర్ లక్ష్మి నగర్ గ్రామనీకి సింగరేణి కేటాయించిన ఇళ్ల స్థలాలను ఇళ్లను పరిశీలించారు వారి యొక్క సమస్యలను తెలుసుకున్నారు సింగరేణి యజమాన్యం మాట్లాడి సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు అలాగే బుధవారం పేటలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను కలెక్టర్ కూల్చి వేయించారు ఈ కార్యక్రమంలో తాహాసిల్దార్ పర్ణాంది.సుమన్ రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ, పీవీ రావు లద్నాపూర్ సర్పంచ్ వనం రామ్ చందర్ రావు , సివిల్ డీజిఎం రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని సీతంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు సామూహిక అన్నప్రాసన, అక్షరభ్యాసం కార్యక్రమాలు నిర్వహించగా ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ కృష్ణవేణి సదానందం హాజరై చిన్నారులకు అన్నప్రసన్న, అక్షరాభ్యాసం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ 6 నెలల వయసు లోపు చిన్నారులకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలనీ, 6 నెలల వయసు దాటిన వారికి అదనపు ఆహారం, అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు అంగన్వాడీ టీచర్, సిబ్బంది ఉన్నారు.

## విద్యుత్ అధికారుల ప్రజాబాట



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద విద్యుత్తు అధికారులు మంగళవారం ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అదనపు జూనియర్ లైన్మెన్ నియమించాలని కోరుతూ విద్యుత్తు డివిజనల్ అధికారికి తెలంగాణ జన సమితి పార్టీ మండల అధ్యక్షుడు కంతి రమేష్ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బద్దం గోపి ఉపసర్పంచ్ నాంపల్లి రమేష్, వార్డు మెంబర్లు, విద్యుత్ సతీష్, నేమూరీ సత్యనారాయణ, చింతకుంట శంకర్, మల్లయ్య యాదవ్, నందగిరి ప్రసాద్, అంగడి సుదర్శన్, గజ్జ రాజేందర్, పత్తిరెడ్డి శ్రీనివాస్, ప్రవీణ్, పడాల బాలరాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం రామకృష్ణపూర్ గ్రామంలో ఉప్పు లక్ష్మి ఇటీవలే మరణించగ మృతురాలి కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరమర్శించారు.ఆయన వెంట మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య,మాజీ సర్పంచ్ ఉప్పు సుగుణ శ్రీనివాస్, నాయకులు కూరాకుల ఓదేలు, కన్నూరి ఓదెలు తోపాటు తదితరులున్నారు. ముత్తారం మండలం సీతంపల్లి గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్ కాలుకి తీవ్ర గాయాలు కాగా వారిని, అలాగే కటకోల కొమురమ్మ గాయపడగా వారిని మాజీ ఎమ్మెల్యే మధు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.